# ఒక ఉత్తరం - జవాబు

శ్రీ వి. ఆర్. శశిధరుడు

హైద్రాబాద్,
18–12–'73.

డియర్ శశీ—

నీ ఉత్తరం అంది చాలా రోజులయింది. దానికి జవాబు వ్రాయటం ఆలస్యం అవుతోంది. ఈ ఆలస్యానికి కారణం అలక్ష్యంకాదని నువ్వు గుర్తించ గలవు. అందుకే ఆలస్యమయినా ఉత్తరం వ్రాయ గలుగుతున్నాను.

నీ కథ చదివి నా అభిప్రాయాన్ని అంద చేస్తాను.

ప్రస్తుతం యీ రోజునుండి నెల రోజులవఱకు శలవు సంపాదించి మన గుడివాడ వెళ్లే ప్రయత్నంలో వున్నాను.

శలవుకు కారణం 'రొటీన్‌లైఫ్'లో 'టేస్ట్' చచ్చిపోయి జీవితం భయంకరంగా వుండటమే!

—అందుకే, నీవూ—నేనూ—మనము జీవిత పాఠాలు నేర్చుకున్న ప్రదేశానికి వెళుతున్నాను. పతి, నేనూ, సుదర్శనం, మన రాజా—వీలున్నంతవఱకూ అందబోయే ఆనందమేదైనావుంటే అనుభవిద్దామని కలలుకంటూ గుడివాడ బయల్దేరుతున్నాను.

నీ ఉత్తరం నాకన్నా రెండుసార్లు నా శ్రీమతి చదవటం తటస్థించింది.

నీ మీద తన 'సింపతీ' చూపెడుతోంది.

స్త్రీ లేందే మగవాడి జీవితంలో 'టేస్ట్'లేదని శ్రమపడి జాలిపడే మహిళలు 'లిప్‌సింపతీ' యివ్వటంలో అగ్రగణ్యులు.

నా శ్రీమతి అనుకొంటుంది—

—నీవు తోడులేక, దొరకక ఎడారిలో ఎండి పోతున్నావని బాధ పడుతోంది. నేను ఆమెను చూచి జాలిపడుతున్నాను. తన మాటగా ఓ సిఫార్సు చేయ మంది.

హిందూధర్మానికి ఆదిమట్టమైన వివాహ బంధానికి కావలసిన మూడు ముళ్లు వేయటం నేర్చుకోమంటూంది.

అలా సిఫార్సుచేసి నీ కొక గుదిబండ తగిలించేసి చూచి సంతోషిద్దామని తన ఆశ.

ఆడవాళ్లంతా యింతే ననుకోబోకు.

పెళ్లైన మగవాళ్లు కూడా యింతే.

అయినా నువ్వు సంసార సాగరంలో మునిగి పోలేక తేలుతూ, తేలలేక మునిగిపోతూవుంటే, చూచి 'వీడు నాకు తోడున్నాడని' ధైర్యం తెచ్చుకునే అవ కాశం యిమ్మని, అందుకోసం నీవు పెళ్లి చేసుకోమని నేను నా శ్రీమతిలా చెప్పదలుచుకోలేదు.

నేను చెప్పబోయేది,

మనిషికి కూడూ, గుడ్డా, 'గుడ్డి'యే కాదు అవసరం, జీవితం.

జీవితం లేందే మనిషి లేడు.

జీవితం అంటే ప్రాణమే కాదు.

ప్రాణమే జీవిత మనుకొంటే, ప్రతి సూక్ష్మ మైన జీవీ మనకన్నా ధన్యమైనదే.

పరిపూర్ణమైన జీవితానికి,

జ్ఞానం, ఆరోగ్యం, డబ్బూ ముఖ్యం.

యీ మూడూ వున్ననాడు జీవితానికి బోల్డంత వ్యాపకం. 'బోర్' కొట్టదు బ్రతుకు.

నీకు జ్ఞానం వుంది. ఆరోగ్యం నేను చూచి నపుడు వుంది. డబ్బు—అదే మనకు లేంది. అందుకే సంపాదించు డబ్బు. అందుకు నీకున్న జ్ఞానాన్ని వుప యోగించు. సంపాదించు.

డబ్బు+జ్ఞానం=కీర్తి

డబ్బు+ఆరోగ్యం=కట్నం.

జ్ఞానం+ఆరోగ్యం=డబ్బులేని మనిషి.

=భయం భయంగా బ్రతికే మనిషి.

=ఆశ నిరాశలమధ్య నలిగే మనిషి.

డబ్బు ముఖ్యం అబ్బాయ్!

చెత్తా చెదారం కాగితాలమీద దులపటం నీ అలవాటుకాదు. నాకు తెలుసు.

నీకున్న మిడిమిడి జ్ఞానాన్ని కాగితంమీద యిమడ్చటంలో నీకు ప్రత్యేకత వుంది. కనుక,

వ్రాయి,
పంపు,
సంపాదించు—
డబ్బూ,
కీర్తి,
అలానే,

యిరవై ఎనిమిది ఏళ్లగా ఏకధాటిగా ప్రవహిస్తున్న రక్తం 'అవుట్‌లెట్'వైపు పరుగెడుతోంది.

అది ప్రకృతి ధర్మం.

అది వికృతి అయితే ఆరోగ్యం సున్నా.

ఆరోగ్యంలేందే జీవితం లేదు.

జీవితానికి ఆరోగ్యం 'టేస్ట్'

ఆరోగ్యానికి శారీరక మానసిక సుఖాలు. 'మెడిసెన్సు' శారీరక మానసముఖ సుఖాలకు 'గుడ్డీ' అవుసరం. 'గుడ్డీకి' మూడు ముళ్ళూ అవుసరం. మూడు ముళ్లకూ డబ్బు అవుసరం.

డబ్బులేందే నువ్వూ, గుడ్డీ పార్కులో కూర్చొని బఠాలు కొనుక్కొని తింటూ చూచుకుంటూ కొన్నాళ్ళు గడపగలరు.

తరువాత,

బఠానీలు తివగా మిగిలిన కాగితాలు తిన్నాక, గడ్డీ, పార్కూ యిలా తినేసుకొంటూ పోతూ, నిన్ను 'గుడ్డీ, గుడ్డీని నువ్వూ తినుకుంటూ, నంజుకుంటూ బ్రతకాలి.

ఆ బ్రతుకు భయంకరం. అందుకని,

వయస్సు తెచ్చిన తొందరలో పడిపోబోకు. అవకాశాన్నీ, ఆలోచన్లనూ వినియోగించుకొని సంపాదించు—

డబ్బు,
కీర్తి,
'గుడ్డీ'!
ఇది మిత్రోపదేశం.

ఈ ఉత్తరాన్ని నా శ్రీమతికి చదివి వినిపించాను. బొటబొట కళ్లవెంట నీళ్లు కార్చుకొంది. నన్నడిగింది—

'అంటే, నావలన నీకు జీవితం భారంగా వుందా?'

నాకు నవ్వు వచ్చింది.

ఆడవాళ్లు అంతా యింతే.

మొగుడు ఎప్పుడూ మనసా వాచా తన్నే తలుచుకొంటూ బ్రతుకుతున్నాడని ఊహిస్తూ బ్రతుకుతారు.

నిజంగా,

ఆమె అంటే నాకు యిష్టం, ప్రేమ, అనురాగం వున్నాయి. ఆమెకు నేనంటే వున్నాయి.

అదే జీవితమా?

ఆ జీవితానికి పరమార్థం భార్య, భర్త, అనురాగం, 'సెక్స్' యివే తప్ప మరొకటి లేదా అని ప్రశ్నించాను. 'ఏమో బాబూ, నాకు తెలీదు' అని వెళ్లిపోయింది లోపలికి. పోనీ, యీ ప్రశ్నను నీ కాబోయే భార్యను అడిగి తెలుసుకున్నాక జ్ఞాపకం వుంటే వ్రాయి. కానీ,

ఆమె తప్పకుండా 'ఏమో బాబూ', అని తప్పుకుంటుంది. 'సస్పెన్స్'ను వుంచటంలో ఆడవాళ్లకు యిష్టం వుంటుంది. అందుకే వారి మనస్సుల్లో వుంది చెప్పరు. ఏదైనా చెప్పారా, చేసారా అంటే; అది తప్పక సలహా అయినా అయివుంటుంది లేదా 'సింపతీ' అయినా అయివుంటుంది.

ఆడవాళ్లకు చేతనయింది, వూహించగలిగింది,

'బ్రహ్మచారి పెళ్లికోసం ఎదురుచూస్తున్నాడనీ, భర్త తనే సర్వస్వంగా బ్రతుకుతున్నాడనీను.'

'పూర్ లేడీస్'!

'సెల్ఫిష్ క్రీచర్స్'!

అందుకే వాళ్లంటే నాకు వల్లమాలిన దయ, కసి. అందుకే మిత్రమా!,

నీవు వ్రాసే ఉత్తరాలు ఏ స్త్రీకి యిచ్చినా యిదే గమ్మత్తు జరుగుతోంది. కనుక,

వయస్సు తొందరచేస్తే బాధపడబోకు. ఉత్తరాలలో వలగ బోయకు. మరి, ఏం చేయాలో నేను చెప్పకపోయినా చేయగల సమర్థుడివి.

కనుకనే,

నేను చెప్పటం లేదు.

నా శ్రీమతి నిన్ను అడిగినట్లుగా చెప్పమంది.

'ఐ విష్ హేపీ హేపీ డేస్ టు యూ!'

—సూరి.

* * *

పూనా,
21–12–'73.

డియర్—

సూరీ—

ప్రొద్దున్నేలేచి, చలిలో—

గాలి చల్లగా తగులుతూవుంటే, కాసేపు వణికి, సిగరెట్ వెలిగించేసి, కాలుతూ, కాలిపోతూవుంటే,

కాలటంలోని మజాను అనుభవించేసి, తర్వాత బైటపడ్డాను.

మామూలే—

'టేస్ట్'లేని కాఫీ'

బస్సువెళ్తూవుంటే, అద్దాల్ని మూసేసి, రోడ్డునుచూస్తూ, వెనక్కు వెళ్లిపోతున్న జడల్నీ, పెట్రోల్ బంకులనూ, బస్సుషెడ్డుల్నీ,

ఇంకా,

అన్నిటినీ చూడటం!

బస్సు ఆగింది. దిగటం, ఆఫీసు మెట్లెక్కటం.

—ఫైళ్లు, చుట్టూ దుమ్ము! సాయంత్రం దాకా, యీ మరో ప్రపంచంలో కాలక్షేపం. 'థ్రిల్', 'వెరైటీ' లేకుండా!

అపుడపుడూ మనస్సు సంతోషాన్ని ఫీలయ్యే అరుదు సంఘటనలు వుండటం. ఆ సంఘటనలు ముఖ్యంగా 'సెంట్ పర్సెంట్' వచ్చిన ఉత్తరాలు—'ఫ్రం' అడ్రసు చూడకుండానే, ఆతృతతో చించి చదవటం,

మళ్లీ చదవటం,

చదువుతూ బోవటం

చదివేసి, సిగరెట్ వెలిగించటం,

కాల్చటం!

జరిగింది యిలా!

ఓ మాట,

సినిమాల్లో 'రొమాన్స్' వుంటేనే బాగుంటుంది. కథల్లో 'రొమాన్స్' వుంటేనే బాగుంటుంది. లేకుండా వుంటే,—విసుగు చూడాలన్నా, చదవాలన్నా—తర్వాత ఆలోచించాలన్నా,

బద్ధకం! 'ఇంటరెస్ట్' లేకుండాపోవటం. అలాంటపుడు, ప్రపంచం 'రొమాన్స్'లో గొంతుదాకా కూరుకుపోయి కళ్లుమూస్తూ, తెరుస్తూ బ్రతికేస్తూంటే, ఇంకా చెప్పాలంటే,

కళ్లల్లో 'రొమాన్స్' మెరుస్తూవుంటే,

ఉత్తరాల్లో,

'రొమాన్స్' కబురు లేకుండావుంటే,

రెండోసారి చదివేలా, తర్వాత యింకా, మనస్సులో దిగులూ, బాధా చోటుచేసుకొని కూర్చుని వుంటే, మరవటానికి ప్రయత్నంలో చదవటం,

'రొమాన్స్' ఉత్తరాలవల్లే సాధ్యం అంటాను!

అందుకే, నా ఉత్తరాల్లో 'రొమాన్స్' కబురు దొర్లటం.

—నీ ఉత్తరం, వాడిగా. సూటిగా, ఇంకా పదునుగా వుండి, మెదడునూ, మనస్సునూ ఆక్రమించుకొని పోతూవుంటే, పోతే,

బకానీలూ,

గడ్డీ, పార్కూ,

'గుడ్డీ'—

కళ్లముందు తిరుగుతూవుంటే, గిరగిరా తిరిగేసి, బకానీలూ, 'గుడ్డీ'. పార్కూ కనపడకుండా

పోయి, గడ్డి రెక్కల్ని తగిలించుకొని ఇంకా తిరుగుతూ కనపడుతూంటే,

కళ్లుమూసేసుకుందామన్న ప్రయత్నంలో జీవితం కాలిపోతూ, మాడి మసి అవటం,

తల్చుకుంటేనే భయం!

మరెలా ?

ఎలా కళ్లుమూసుకోవటం ?

కళ్లుమూయకుండా, కంటిపాపని రెప్పల్తో కప్పకుండావుంటే,

కాలిపోతూన్న జీవితం, గడ్డిలో తగులబడు తున్న జీవితం,

మెదడు వేడిలో కరిగిపోతోంది !

నువ్విచ్చిన 'డెఫినిషన్లు' నా 'డిక్షనరీ'లో వ్రాసుకొంటున్నాను.

డబ్బు+జ్ఞానం,

డబ్బు+ఆరోగ్యం—

మాటల్ని చిన్నవిగా వ్రాసి,

జ్ఞానం+ఆరోగ్యం మాటను కనపడేలా వ్రాసు కున్నాను. రెడ్ పెన్సిల్‌తో అండర్‌లైన్ చేసాను.

ఒప్పుకుంటున్నాను,

మనిషి సుఖంగా, సులువుగా బ్రతికివేయ టంలో, డబ్బు ఆలోచనవల్లే సుఖాంతం లేదు. వుండాల్సిందీ, ఎదురుగా, పెరిగిపోతూ కనపడేది, కనపడాల్సిందీ డబ్బు !

కానీ, వుంటేనే—

దానివల్లే అన్నీ సులువుగా దొరుకుతూవుంటే, (కొన్ని దొరక్కపోయినా, వాటిగూర్చి బాధపడే తీరికా, ఓపికా 'బ్రైంవేస్ట్!') మెత్తని పరుపునూ, అంత కంటే మెత్తని పెళ్లాన్నీ, రంగులగ్లాసులో, గులాబీ రంగులా కనపడే ద్రవం, గొంతులో సుతారంగా, మెత్తగా దిగుతూవుంటే,

బ్రతుకుతున్న బ్రతుకులో—

సెకన్లు నిముషాల్లా మారుతూ, నిముషాలు గంటల్లా, గంటలు రోజుల్లా మారుతూ సర్కిల్ బ్రతుకుతూ తిరుగుతూవుంటే,

పెరిగిపోతూ కనపడే జీవితంలో నిజంగా, 'సుఖం' వుంటుందంటావా నువ్వు?

నేనేమంటానో తెల్సా ?

నా 'డిక్షనరీ'లో నాకు అర్థమయిందీ, తెల్సిందీ,

జీవితం అంటే,

నవ్వటం, ఏడవటం, సంతోషపడటం, దుఃఖ పడటం !

నవ్వూ,

సంతోషం—

జనం కోరుకునేదీ, కావాలని తాపత్రయ పడేది;

ఏడుపూ,

దుఃఖం—

కావాల్సింది ఎవడికి? తాపత్రయపడేది ఎవడు?

వుంటాడా యీ భూవిమ్మీద ?

కానీ,

దూసుకువచ్చేసి హృదయంలో దిగిపోతే, ఏం చేస్తాడంటావ్ ?

వెరీ సింపుల్ !

దుఃఖంలో, ఏడుపుతో వాడి జీవితం తెల్లారి పోతుంది. అలాంటి జీవితంలో, ఎడారి వయాసిస్సులా నవ్వూ, సంతోషం కనపడితే,

'వెరైటీ'ని విందుగా, రాత్రి పన్నెండుగంట లప్పటి వెలుగుతున్న గుడ్డిదీపం కాంతి, (సాయంత్రం ఆరుగంటలప్పటి గుడ్డిదీపం వెలుగుకూ, రాత్రి పన్నెండు గంటలప్పటి గుడ్డిదీపం కాంతికీ చాలా తేడా వుందని ఒప్పుకుంటావుగా నువ్వు? తప్పదు. ఒప్పుకో వాలి. రూలులాంటి విషయం). చుట్టూ చిమ్మటం, దాంతో గది స్పష్టంగా కనపడటం లాంటి నిజం,

'వెరైటీ'లో వుంటుంది.

దాంతో,

ఆ కాసేపూ,

పొందిన ఆనందం, కొంచెం సేపయినా,

తాత్కాలికంగా వుండిపోయినా, అనుభూతిమాత్రం కొన్నేళ్లకు సరిపడేలా వుంటుంది.

మరి,

అలాంటి 'వండర్‌ఫుల్' అనుభూతి కావాలి నాకు. అందుకే నేను యిష్టపడేవి యీ జీవితంలో, నాలుగున్నాయి. అవి,

నిజంగా నాలుగు. నాలుగులో రెండు ఏడవటం, దుఃఖపడటం అయితే, మరో రెండు అపుడప్పుడూ మాత్రమే నేను కోరుకునేవి నవ్వూ, సంతోషం!

--'ఫూల్'నా నేను?

'ఇడియట్'నా?

లేకపోతే,

రెండూనా?

బలంగా వుందనుకొన్న నా 'గుండె'—ఇవ్వాళ రాత్రి ఆగిపోతుందని తెల్సినపుడు, యీ క్షణంనుంచీ, గుండె ఆగేదాకా ఏం చేస్తానంటావ్?

వున్న కొన్ని గంటల్నీ గడపటంలో, కుర్ర ఆడదీ, ఖరీదైన మెరిసే విస్కీసీసా, 'నేకెడ్' శరీరంలో గదిలో సంతోషం పొందుతూ వుండటం ఎంతగా అబద్ధమో—;

చావు ఆలోచనలు మెదడులోనూ, గుండెలోనూ సుళ్లు తిరుగుతూవుంటే—ఏడుస్తూ, దుఃఖంలో సతమత మవటం, అంతగా నిజం!

—నీ వూహలో నిజాన్ని పంపి ఆలోచించు. చుట్టూ వున్న ప్రపంచంలో యివ్వాల్టిదాకా గడిపేసిన నా బ్రతుకు ఖరీదు—

నా వూహలోని ఖరీదుతో తేడా చూస్తే, త్రాసులో అటూ, ఇటూ వేసి తూస్తే, రెండు వైపులా చూచి 'ఇన్సల్ట్' ఫీలయ్యాను. దాంతో—హృదయం, మెదడూ,—నా తప్పుడు అంచనాను చూచి విరగబడి త్రుళ్లుతూ నవ్వేయి.

చుట్టూ వెక్కిరిస్తూ నవ్వులు.

—నిన్నటి నా వూహలలోనివి కొంచెంగా కరిగిపోయి ఇవ్వాళ నన్ను దెబ్బతీస్తే, రేపు, మళ్లీ వచ్చే



అమృతాంజన్ లిమిటెడ్‌వారి గ్రైప్ మిక్స్చర్ జీర్ణశక్తిని సరిచేస్తుంది. దానికి తోడ్పడుతుంది. బిడ్డని ఆరోగ్యంగా, సంతోషంగా ఉంచుతుంది. అమృతాంజన్ లిమిటెడ్ వారి గ్రైప్ మిక్స్చర్ సులినొప్పి, వాయువు, అజీర్ణం, పళ్లువచ్చే కాలంలో ఇబ్బందులు వాటికి మంచి గుణం ఇస్తుంది.




అమృతాంజన్ లిమిటెడ్

బిడ్డ సంతోషంగా ఉంటే
అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్ వాడినట్లే

OBM:2642 TG

రేపులో, నిన్నటి వూహలు పూర్తిగా కరిగిపోయి కనపడకుండా పోవటంగూర్చి, ఇవ్వాల్టి అనుభవంను రేపటి అద్దంలో చూస్తే, లేదా చూడాలని ఆరాటం పొందితే,

బ్రతకటం అనే మాట, సాదా సాఫీ మాటలో వెక్కిరింత వుంది. రెక్కలు తెగిపోయిన వూహ, నెత్తురులో తడిసి ముద్దయి, కూలిపోతూవుంటే,

కళ్లు తిరగవూ?

కళ్లు తిరుగుతూవుంటే, ప్రపంచం తిరగదూ? తిరిగే ప్రపంచాన్ని తిరక్కుండా పట్టుకొని ఆపగలగటం సాధ్యం అంటావా నువ్వు?

సాధ్యం కానపుడు, యిలాగే కళ్లు తిరిగే బ్రతుకులో అర్థం?

—ఇవ్వాళ, యీ క్షణంలో నాలో ఉత్సాహం, వుద్రేకం వున్నాయి. నిద్రమత్తు ఆఫీసు జీవితంలో తృప్తిలేకున్నా, వున్నాయని నన్ను మభ్యపెడుతూ మోసగిస్తున్న నా మనస్సు నన్ను తినేసి బండలా నిద్రపోతూంది. అది ఇవ్వాళ మళ్లీ లేచి, నామీద విరుచుకు పడుతోంది. దాంతో, నా మెదడులోని నరాలు నాతో మాట్లాడుతున్నాయి. ఆ మాటల్లో స్పష్టత లేకుండా, వినపడకుండా వున్నాయి.

నాకు మూడు ముళ్లూ వేసే 'సర్టిఫికెట్' వుంది. దానికి గర్వపడాలో లేదో తెలీకుండా వుంది. ఎందుకంటే,

—యీ మొగుళ్లు రోగ్స్! పెళ్లాం మనస్సులో పిల్లలూ, మొగుడూ వుంటే,

మొగుడి మనస్సులో,

ఆఫీసుపని, రోడ్డువిూద ఆడనేస్తం [నాకు తెల్సిన చాలా మొగుళ్ల గూర్చి నేను వ్రాసేది] వుంటే, ఆ ఆలోచనలే మెదడును తొలిచేస్తోంటే,

మొగుడూ పెళ్లాల మధ్య వుండేది 'సెక్స్ అనే నేను అనుకోవటం. ఇంకో విధంగా మొగాడి 'సెల్ఫిష్నెస్'—[నీ మాటను, అదే, ఆడది 'సెల్ఫిష్'—అనే మాటను రెడ్డింకుతో అడ్డంగా కొట్టేస్తున్నాను.]

ఓ 'ఎగ్జాంపుల్'—

రాత్రివేళల్లో యింటికొచ్చే మగవాడు మల్లెపువ్వుల్ని తెచ్చి పెళ్లాం తలలో కూరటంలో, మంచం విూద ఇద్దరూ వున్నపుడు—చెమటవాసల్ని పూలు కాల్చేస్తాయన్న మాట వుంది. అంటే,

పావలా పూలు వాడు కొంటున్నాడంటే, పెళ్లాం తల అందంకన్నా—వాడికి కావాల్సింది, మంచం విూద పూల వాసన.

ఇది 'సెల్ఫ్' కదూ?

రేపు నేనూ అంతే; ఇంకా,

ఇవ్వాళ, రోడ్డువిూదపోయే అందమైన అమ్మాయితో నా మనస్సు 'డివ్‌వైట్' 'బెడ్‌రూమ్'లో కలిస్తే,

యీ క్షణంలోనే నా పెళ్లాం మనస్సూ అదే పనిచేస్తే—

రెండింటికీ తేడా లేకపోయినా, నా పెళ్ళాం మనస్సును పాతేయాలని నేనుపడే ఆరాటం, లేదా రాక్షసతత్వంతో నేను మొగుడుననే మాట వుంది.

—యీ ఉత్తరాన్ని ముగించే ముందుగా,

నీ నెల గుడివాడ జీనితంలో కొంచెంగా అయినా 'రొటీన్' విసుగు జీవితంలోని క్షణాలు ఆనందంగా, పతీ, సుదర్శనం, మన రాజాలతో గడపాలని తలుస్తాను.

నీ శ్రీమతినీ, మిత్రజనాన్నీ అడిగినట్లుగా,

ఇంకా,

యీ అందరిమధ్యా,

స్నేహం మాటల్తో చూపుల్తో ఉక్కిరిబిక్కిరి అవ్వాలనే నా మాటను నీ మాటగా మన వాళ్లకు చెప్పు.

వుంటున్నాను.

—నీ శశి.